విశ్వకర్మ

★

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

గంగయ్య ఉదయాన్నే లేచి స్నానంచేసి, వొంటికి విభూతికట్లు, నుదుట కుంకంబొట్టు పెట్టుకుని, బాడిత చేతబుచ్చుకుని, గడపదాటి వీధిలోకి వచ్చాడు. అతనికి ఒకేఒక సమస్య. ఆరోజు కూలి సంపాదించి, కడుపులో ఏమైనా వేసుకోవాలి. అంతకు మించి అతనికి కావలసినదేమీ లేదు. కాని అన్నిటికన్న అదే చిక్కు సమస్య. ఈ సమస్యా పరిష్కారార్థమై బయలుదేరేడు.

శీతకాలం కావడం వల్లనూ, ముడుతలు పడిన శరీరంమీద సరియైన బట్ట లేకపోవడంవల్లనూ, కొంచెం చలివేసింది. గంగయ్యకు గడచిన జీవితం ఒక్కసారి జ్ఞాపకం వచ్చింది.

తను యవ్వనంలో వున్నప్పుడు మంచి బలశాలి. ఎంత చలికాలమైనా తెల్లవారు గట్ల నాలుగోగంటకు లేచి చన్నీళ్ళు స్నానం చేసేవాడు. ఎప్పుడూ ఇంత చలి అనిపించలేదు. శుభ్రంగా స్నానంచేశాక, విభూతి కట్లుపెట్టి, దైవప్రార్థన చేసుకుని, బట్టలేసుకుని, భుజంమీద ఎర్రటి సిల్కువోణీ గాలికి రెపరెప లాడుతూంటే, మీసం మెలివేస్తూ, మందగమనంతో మెల్లిగా అడుగులు వేసుకుంటూ వీధిలోకి వచ్చేవాడు. ఎవరైనా దారిలో పలకరించి "ఎక్కడికోయ్" అని అడిగితే, ఏ మిల్లులో పనికో, ఏ మేడ కట్టడానికో అని చెప్పేవాడు. అనడమే కాదు పని చేసి చూపించేడు లోకానికి. మాటమీద మాటొచ్చి పంతంమీద పట్నంలో ప్లీడరుగా రిల్లంతా తన వొక్క చేతిమీదే కట్టిచూపించేడు. నలుగురి పని ఒక్కడే చేసేవాడు. లాల్చీ విప్పి, చేత్తో రంపంపట్టుకుని చూరుబల్ల కోస్తూంటే చెమటపట్టిన శరీర ఎండకి నిగనిగ మెరిసేది. కండలు వెదురుకర్రలా పెళపెళమనేవి. సాయింత్ర మయేసరికి రెండుమూడు రూపాయలు కళ్ళజూసేవాడు.

వెధవ డబ్బు. బాడిత పడితే రూపాయి. రంపం పడితే రెండు. చిత్రికపట్టేడంటే ఎలాంటి పేడైనా అద్దంలా తళతళ లాడేది.

"మనం సిత్రికపడితే బల్ల సెక్కమీద, నీడ కనిపించేది నీడ. అదీ, పనోడి తన మంటే! సీ, యిప్పట్లోల్లకి పనే సేతకాదు" అనుకున్నాడు మనుసులో గంగయ్య.

అంతవర కెందుకు? తన కొడుకు చేస్తున్నాడు పని, చూస్తున్నాడు గదా తను. లేక లేక ఒక్క కొడుకు. వాడిని యీ చుట్టుపట్ల ఊళ్ళన్నిటికీ గొప్ప పనివాడిగా చెయ్యాలని ఎంతో తాపత్రయపడ్డాడు తను. కాని తల్లే వాడిని ముద్దుచేసి పాడుచేసింది. వెధవ? పోకిరీ అయిపోయాడు. పెళ్ళిచేస్తే దారిలో కొస్తాడని వాడి తల్లి పోరుపెట్టింది. పెళ్ళిచేశాడు. వెంటనే వాడు పెళ్ళాన్ని తీసుకుని వేరైపోయాడు. ఆ వెధవ తిరిగిన తిరుగుళ్ళు చూడకండా ముసిలిదాని కళ్ళు పోయాయి.

ఇప్పుడు తన శరీరం ముడతలు పడింది. ఒంట్లో శక్తి తగ్గిపోయింది. దృష్టి సమంగా ఆనదు. రోజులు గడవడం కష్టమైపోయింది. ముసిలిది అదృష్టవంతురాలు, వేగమే వెళిపోయింది. తను ఆశలు పెట్టుకున్న కొడుకలా అయిపోయాడు. తన కింకెవ్వరూ లేరు. తనొక్కడే. తనొక్కడికీ రోజుకి పావలో అర్ధో దొరికితే చాలు. కాని అది దొరకడమే కష్టమైపోయింది.

బాడిత భుజాన్న వేసుకుని నాలుగువీధుల

మధ్య రామమందిరం దగ్గరికి వచ్చాడు గంగయ్య. మందిరంవేపు తిరిగి దండం పెట్టుకున్నాడు.

అక్కడే కనిపించాడు వెంకడు. వెంకడు సన్నంగా పొడుగ్గా ములంకాడలా వుంటాడు. దూరం నుంచే వెంకడని పోల్చుకోవచ్చును. వాడిని చూసీ చూడనట్టు పక్కకు తిరిగి గబగబ అడుగులు వేశాడు గంగయ్య. అయితే వెంకడు వెనకనుంచి గంగయ్య చెయ్యి పట్టుకున్నాడు.

"ఏటి గంగయ్యా తప్పుకు తిరుగుతున్నావ్. అప్పు తీసికెళ్ళిన డబ్బులు తిరిగియ్యక్కర్లేదేటి? ఏటి ఎగేసిద్దామనే" అన్నాడు వెంకడు.

"పారేస్తాను నేరా, యింతోటి అప్పూను. పావలా డబ్బులికి యీదిలో నిలబెట్టేసినావు. మాంచి పెద్దమనిసివే," అన్నాడు గంగయ్య చెయ్యి విదిలించుకుంటూ.

"ఎవరు నువ్వా నేనా. ఆ పావలా డబ్బులు కోసం వొచ్చి బతిమాలి వొట్టికెల్లినావ్. ఏటి, అంత యిస్నా కార్యమైతే పారేరాదూ. పావలా డబ్బులట! పావలా డబ్బులు! ఏం వుత్తినే వొచ్చినాయేటి డబ్బులు! తే, పడీ" అని అల్లరిపెట్టేడు వెంకడు. వెంకడు పాపం మంచివాడే. కాని డబ్బు లెవడు వదులుకుంటాడు.

"నాకాడిప్పుడేటి నేదు సుమా. ఇచ్చేస్తాను నేరా, నీ డబ్బు లెవడికి కావాలి"

"ఇలా సాలకాలమైంది నాయనా, నీ మాయలు నాకాడ తీసీ" అని వెంకడు గంగయ్య భుజంమీది బాడిత లాక్కున్నాడు. "నా డబ్బులిచ్చి నీ బాడిత వొట్టుకెల్లు, అంతే."

"నాయన్నాయన, నీ పున్నె ముంటాదిరా బాబూ. సాయింతరం నీ డబ్బులు నీకిస్తారా. బాడిత నాక్కుంటే యికనే తినేదేటి? ఒగ్గిరా నాయనా," అని బతిమాలుకున్నాడు గంగయ్య.

ఈ తగువు వినడానికి నలుగురు పెద్దమనుషులు మూగేరక్కడ. వారంతా గంగయ్యమీద జాలి పడ్డారు.

"ఆడికాడేటుందిరా, ఆడి నొట్టుకున్నావ్" అన్నాడొక పెద్దమనిషి.

"ఆ, నేదు. నేకపోడమేటి? క్లబ్బులో కూకుని టీ నీల్లు తాగడానికుంది" అన్నాడు వెంకడు.

అప్పుడప్పుడు బియ్యానికి డబ్బులు లేకపోతే, పట్నమెళ్ళే రోడ్డుమీదున్న క్లబ్బులో అణా యిచ్చి టీ తాగేస్తాడు గంగయ్య. కాని ఊళ్ళో చాలమందికి టీ తాగడం విలాసం. బియ్యానికి డబ్బులేక టీ నీళ్ళు తాగుతూ వుంటానని చెప్పుకోవడం యిష్టం లేక పోయింది గంగయ్యకి. సాయింత్రం ఎలాగైనా డబ్బులు తెచ్చియిస్తాను బాడిత వదిలీమని బతిమాలేడు. గంగయ్య సాయింత్రం డబ్బులు తెచ్చియివ్వడానికీ, వెంకడు గంగయ్యను వదిలిపట్టడానికి పెద్దమనుషులు తీర్పు చెప్పేరు.

గంగయ్య మళ్ళీ భుజంమీద బాడిత వేసుకుని నడక ప్రారంభించేడు. ఇవాళ ఒక పావలా డబ్బులు సంపాదించి అప్పు తీర్చాలి. ఈ వెధవఊళ్ళో పావలా కూలి ఎలా దొరుకుతుంది. నాలుగు బ్రాహ్మణ కొంపలు, రెండో మూడో రాజుల, కోమట్ల కొంపలు వున్నాయి. తక్కిన వాళ్ళంతా కాపు, గొల్ల, సాలె, కంసాలి, చాకలి, మంగలి, మాల, మాదిగ కులాల వాళ్ళు. వీళ్ళ కొంపల్లో వడ్రంగివాడికి కూలిచ్చి చేయించుకునే పనులేమిటుంటాయి. వాళ్ళకే తిళ్ళు లేక ఏడుస్తున్నారు. వాళ్ళింకొకరికి పెట్టేదేమిటి? పోనీ రాజుల ఇళ్ళకు వెళదామా అంటే అక్కడ మాత్రం ఏం దొరుకుతుంది. వాళ్ళ ఇళ్ళేమో పెద్ద పెద్దలోగిళ్ళు. కాని వాళ్ళంతా, ఆస్థులు పాస్థులు అన్నీ హరించుకుపోయి, ఏదో గుట్టుగా బదుక్కొస్తున్నారు. ఆ లోగిళ్ళన్నీ ఒక మూల పడిపోతున్నాయి. ఇళ్ళమీది పెంకులు రాలిపోతున్నాయి. గోడల పగుళ్ళలో చెట్లుచేమలు మొలుస్తున్నాయి. పాపం, వాళ్ళస్థితి అలావుంది. ఇక ఏమైనా ఆశవుంటే బ్రాహ్మణకొంపల్లోనే. అసలు సామెతేవుంది. పనిలేక పోతే బాపనవీధికి వెళ్ళమన్నారు. ఇంటికొచ్చిన ప్రతి వాడికీఏదోపనిపురమాయిస్తారు. అయితే, పని చేయించుకుని డబ్బు లివ్వడానికిదొతారు. బతిమాలుకుంటే గంజో కడుగో పడేస్తారు. కాని తనకి పావలా డబ్బులు అవసరం. కడుపులో ఏమైనా వేసుకోడానికి మరో పావలా డబ్బులు కావాలి. ఇవాళ అర్ధ

రూపాయి సంపాదించాలి. ఎలాగ. ఈ ఊళ్ళో అసాధ్యం. పట్నంపోవాలి. ఇక్కడికి మూడుమైళ్ళ దూరం. తను అంతదూరం నడిచివెళ్ళి, కూలిచేసి పట్టుకొచ్చే దేమిటి? ఇప్పటికే బాగా పొద్దెక్కిపోయింది. సరే ముందు బ్రాహ్మణ ఇళ్లకువెళ్ళి ప్రయత్నించి చూడాలి, అనుకుని బ్రాహ్మణవీధి వెళ్ళేడు గంగయ్య.

మొదటి మూడిళ్ళలోనూ ఏమీ పనిదొరకలేదు. నాలుగో ఇంటికి వచ్చాడు. శీతకాలపు ఎండ చుర్రున తగులుతూంది. గంగయ్య అప్పుడే అలసిపోయాడు. కొంచెం అలసట తీర్చుకుందామని ఇంటి అరుగుమీద చతికిలబడ్డాడు. కడుపులో కిందటి రాత్రి నుండి ఏమీలేదు. ఆకలివేస్తూంది. గంగయ్య కేమీ తోచడం లేదు. బుర్రలో ఎటువంటి ఆలోచనా లేదు. అత నెప్పుడు ఆలోచించినా తనగురించే ఆలోచిస్తాడు. కడుపు అగ్నిహోత్రంలా మండుతూంది. ఏమైనా లోపల పడాలి. అదే అతని ఆలోచన. అంతకు మించి అతనికే గొడవా అక్కరలేదు.

ఎదురుగుండా దూరాన్న వేపచెట్టుకింద ఎవరో పదిమంది మూగేరు. ఏమీ లేదు, గొర్రెపోతును వేసేశారు. అంతే, గొర్రెపోతు చర్మం వొలిచి, చెట్టుకొమ్మకు బాగా కిందికి వేలగట్టి, మాంసం తీసి బండరాయిమీద వంతులు వేశారు. ఒక్కొక్కరువచ్చి మాంసం మర్రిఆకులలో పెట్టి పట్టుకుపోతున్నారు. ఒకడు తల, యింకొకడు కాళ్ళు, పట్టుకుపోయారు. చర్మం కోసమని వచ్చిన చమారివాడు, కొంచెం మాంసంపడేయమని ప్రాధేయపడుతూ నిలుచున్నాడు. ఈ దృశ్యాన్ని గంగయ్య తదేకదీక్షగా చూస్తున్నాడు. మాంసం రుచితగిలి చాలకాలమైంది. తింటే కార్జం తినాలి! ఏమి రుచి! గంగయ్యకు నోరూరింది. మరో పదినిముషాల్లో మాంసం పంపకం అయిపోయింది. ఎవరిమానాన్ని వారు పోయారు. గంగయ్యలేచి, మెల్లిగా అడుగులు వేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళి సావిడిలో గుమ్మంలో నిలబడ్డాడు. లోపల ఎవరో పడమటింట్లో వండుకుంటున్నారు.

"అమ్మా, నరసమ్మగోరూ" అని పిలిచేడు గంగయ్య. నరసమ్మ వంటింట్లోవుంది. ఆవిడ రాలేదు. అయితే పక్కగదిలో వున్న కోడలు కాంతమ్మ వచ్చింది.

"ఏం గంగయ్యా, ఇలా వచ్చావు" అని ప్రశ్నిస్తూ, కాంతమ్మ వాకిట్లో ఎండలో మంచం మీద కూర్చొబడి, జడ విప్పుకోవటం మొదలు పెట్టింది.

"ఏం లేదమ్మా, పనేదైనా వుందేమోనని" అంటూ గంగయ్య సావిడిగుమ్మందాటి లోపలి కొచ్చి కూర్చున్నాడు.

"మాయింట్లో ఏమీ పనిలేదే. ఏం, ఇవాళ ఎటూ వెళ్ళలేదా ఏమిటి?"

"లేదమ్మా, ఎటూ లేదు. నిన్నటినుంచి పనీ లేదూ పాటూ లేదు. ఏదైనా పనుంటే యియ్యండమ్మా, సేస్తాను"

"మాయింట్లో ఏమీ లేదోయ్"

"లేకపోవడమేటి, నరసమ్మగోరిని పిలవండమ్మా, మీ కేటి తెలుస్తాది" అని గంగయ్య వాకిట్లో వున్న మంచాలవేపు చూసేడు, దేనికైనా మరమ్మత్తు అవసరమేమోనని. "ఇంట్లో నలుగురు కుర్రవాళ్ళున్నారు. మంచాలేసా ఇరగ్గొట్టరు నాయనలు" అనుకున్నాడు గంగయ్య.

"అమ్మా, నరసమ్మగోరూ" అని కేక వేశాడు గంగయ్య. పడమటింట్లోంచి నరసమ్మ బయటికి వచ్చింది. కోడలు ఎండలో కూర్చుని వుండడం చూసి, "అదేమిటమ్మా, వాకిట్లో కూర్చున్నావ్. శీతకాలపు ఎండ ఒంటికి మంచిది కాదు. అరుగుమీద కూర్చొవెళ్ళి" అంది. కాంతమ్మ లేచి చీడీమీదకొచ్చి కూర్చుంది.

"ఏం గంగయ్యా ఇలా వచ్చావు" అంది నరసమ్మ.

"ఏం లేదమ్మా, కొంచెం కాఫీ నీల్లుంటే ఇప్పించండమ్మా" అన్నాడు గంగయ్య, స్థంభానికి జారబడుతూ. గంగయ్యకు ఆకలి దంచేస్తోంది.

"బాగుందిరా నాయనా, ఇప్పుడేం కాఫీ, మా భోజనాలయిపోతేను" అంది నరసమ్మ.

“అమ్మ, మీకు పుణ్నెముంటాదితల్లీ. కడుపులో కావయ్య కయ్యి, కుయ్యిమంటున్నాడు.”

“ఇప్పుడు కాఫీ లెక్కడివి గంగయ్యా, నీకేం వెర్రా ఏమిటి?” అంది కాంతమ్మ ఊడివస్తూన్న జుత్తు దువ్వెన పళ్లలోంచి తీసి పరిశీలిస్తూ.

“చూసేరా అత్తయ్యా జుత్తు ఎలా వూడిపోతోందో” అని ఊడిన వెంట్రుకలు అత్తగారికి చూపించింది కాంతమ్మ.

“అవునమ్మా నీకు జాగ్రత్తలేదు. నీళ్ళాడి మూడువారాలు కాలేదు. అప్పుడే ఏది బడితే అది తినేస్తున్నావు, పత్యం చెయ్యకపోతే ఎలా చెప్పు? ఒళ్ళు జాగ్రత్తగాచూసుకోకపోతే ఎలాగే! ఏం చిన్నపిల్లవా?” అని కేకలేసింది అత్తగారు. జుట్టు ఊడిపోవడానికీ పత్యం సమంగా చెయ్యకపోవడానికీ సంబంధమేమిటో కాంతమ్మకు సమంగా బోధపడలేదు కాని మాటాడకుండా వూరుకుంది. గంగయ్య కునుకుపాట్లు పడుతున్నాడు. వీళ్ళు వెంట్రుకలు పోతున్నాయని ఏడుస్తున్నారు, తన ప్రాణాలే పోతూవుంటేను. వెధవ వెంట్రుకలు వూడిపోతే పోనీరాదూ. నూనె కర్చు మిగులుతుంది అనుకున్నాడు గంగయ్య. నరసమ్మ గంగయ్యవేపు చూసింది. “నాగమ్మకు ఆకలేస్తూందికాబోలు పాపం” అంది కోడలితో. కాంతమ్మ నవ్వింది.

“గంగయ్యా, గంగయ్యా” అని పిలిచింది నరసమ్మ.

“ఏటమ్మా, కాఫీ నీళ్ళేటి...” త్రుళ్ళిపడి లేచాడు గంగయ్య.

“కాఫీ లేదుసుమా. పోనీ కొంచెం చల్దివణ్ణం వుంది తింటావా?”

“ఛ. అదేటమ్మా, ఇప్పటికి నా జలమలో మా కులమోళ్ళదగ్గర తప్ప ఎక్కడా పచ్చి మంచి నీల్లయినా తాగనేదు. కులస్థుడినికదా, మీయింట్లో సలిదిగంజి తాగమంటారా?”

“చాల్లేరా, దిక్కుమాలినకులం. అలా పెరట్లో నూతిదగ్గర కూర్చుని తినీ, ఎవరూ చూడరులే” అంది నరసమ్మ.

కాంతమ్మ పకపక నవ్వింది. “తినకేం చేస్తాడత్తయ్యా, ఈవూళ్ళో వీళ్ళవాళ్ళందరూ మాంసం కూడా తినేస్తారట.”

“ఛ. ఛ. ఈరబ్రెమ్మంతోడమ్మా. వూళ్ళో జాత్తక్కువ వెధవ లెవరో తింటే అందరినీ అనేస్తారేటి, మంచోరే.”

“పోనీలేరా ఓ చిన్నపని చేసిపెడుదూ. నాలుగు మెతుకులు పడేస్తాను తిని, వీధరుగుమీద పడుకుందువుగాని” అంది నరసమ్మ.

“ఆ. సెప్పండమ్మా, ఏంపని?” అని చేత్తో బాడిత తీసి పట్టుకున్నాడు.

“బాడితపని గాదురా నాయనా, ఎల్లుండి మాయింట్లో మా పిల్లడి బారసాల.”

“ఉయ్యాల మంచం సెయ్యమంటారేటి. నే సేసిన వుయ్యాలలో బొట్టిడిని తొంగో పెట్టండమ్మా, గొప్పోడైపోతాడు. సూసినారా, పట్నంలో ఇనసిప్పిక్టేరుగారింట్లో పిల్లలందరూ నే సేసిన మంచం మీద తొంగున్నవోరే. ఇప్పుడెంతేసివోరైనారు. ఒకడు వాకీలు, ఒకడు తాసీల్దారు, ఒక డేదో సాల పెద్ద ఉద్యోగం...‘గంగయ్యా నీసేతిసలవరా’ అంటా దిప్పటికీ ఆ తల్లి మాలచ్చిమి. పనిసేసినానుంటే ఆల్లిచ్చే మజూరీలుండి పోతాయేటి. పేరుండి పోతాది గాని.”

“మా కిప్పుడేం వద్దుగాని ఓచిన్నపని చెయ్యాలి చెయ్యగలవా?”

“సెప్పండమ్మా, పని మంతుకు సెయ్యలేని పనేటి?”

“ఎల్లుండి మాయింట్లో మా మనమడి బారసాల. నాలుగు కొబ్బరికాయలు తీసిపెడుదూ”

“ఏటీ కొబ్బరిసెట్టెక్కమంటారా, మంచోరే. నా సేతకాదమ్మా. ఏతోడిని పిలవండి.”

“నాయన్నాయన, నా బాబువుకావూ. ఏత వెధవ అత్తారింటికి పోయాడురా. పదిరోజులదాకా రాడట”

“ఇదేటమ్మా, నన్ను సెట్టెక్కమంటారేటి, నావురుతి కాదది”

"బాబ్బాబు, నీకో బేడ డబ్బు లిచ్చుకుంటా నురా. కాయలన్నీ కోతులు పాడుచేసేస్తున్నాయి. ఎల్లుండి ఇంట్లో బారసాల కూడాను."

గంగయ్యకు ఆశ పుట్టింది. చల్ది అన్నం కడుపులో పడుతుంది. వూరగాయ నంజుకుంటే మహా రుచిగా వుంటుంది. ఇప్పుడింత కడుపులో పడితే మళ్ళీ రాత్రివరకూ పచ్చి మంచినీళ్ళయినా తాగక్కరలేదు. తరవాత బేడ డబ్బు లిస్తానంటూంది ముసిలిది. ఇవాళ రాత్రి, రేపు పొద్దున్నా టీనీళ్ళు తాగవచ్చును. అన్నట్లు వెంకడి అప్పో? సరే బేడడబ్బులు చేతిలో పడినతరవాత ఆలోచించవచ్చును.

"అయితే పడేయండమ్మా నాలుగు మెతుకులు"

"నాలుగు కాయలు కోసి వెళిపోరాదా, తరవాత సావకాశంగా తిందువుగాని. ఇప్పుడు తింటే ఆయాసంతో పడుకుంటావ్,—మరి నువ్వు కాయలు కోసేదేమిటి? వెళ్లు. ఎంతసేపు, అయిదునిముషాలపని," అని దబాయించింది నరసమ్మ. అవును, లేకపోతే చెట్టెక్కడు వెధవ. ఇలాంటివాళ్ళతో పనులు చేయించుకోవడంలో నేర్పు వుండాలి, అనుకుంది నరసమ్మ.

"పోనీ కొంచెం సుద్ది దాహం యిప్పించడమ్మా" అన్నాడు గంగయ్య. నరసమ్మ మజ్జిగనీళ్ళు తెచ్చి చెంబులో పోసింది. గంగయ్య చెంబెడు మజ్జిగ తాగి, జిర్రున తేన్చి, పెరట్లో కొబ్బరిచెట్టుకిందికి వెళ్ళి నిలుచున్నాడు. చెట్టు పొడుగ్గా, స్థంభంలా నున్నగా వుంది. దీన్ని తెగగోయ్యా, ఎంత ఎత్తుంది అనుకున్నాడు గంగయ్య. పనివిషయంలో గంగయ్య ఎన్నడూ ఓటమిని వొప్పుకోలేదు. తన శక్తిసామర్థ్యాల మీద అతనికి ఎంతో విశ్వాసముంది.

కాళ్ళకు తాడు, మొలకు ఆవుకన్నె కట్టుకుని, కొయ్యడానికి కత్తిలేకపోవడంవల్ల బాడిత భుజాన్ని వేసుకుని, చెట్టు ఎక్కడం ప్రారంభించేడు. అలవాటులేనిపని, మొదట్లో చాల కష్టమయింది. కాని మొండి పట్టుదలపడితే సాధ్యం కానిదంటూ వుండదు. మీద కెక్కిపోయి కాయలు కోశాడు. కిందనున్న నరసమ్మ కాయలు ఏరి తట్టలో పెట్టింది.

"చాల్లే గంగయ్యా, ఇక దిగు" క్రిందనుంచి కేక వేసింది నరసమ్మ.

గంగయ్య బాగా అలసిపోయాడు. దాహం వేస్తూంది. ఒక్కత్రుటి ఆగి నాలుగు ప్రక్కలా చూసేడు. వూరంతా కనిపిస్తూంది. దూరాన్న పొలాలు; కళ్ళాలు కనిపిస్తున్నాయి. చెరువు వొడ్డున కళ్ళంలో రైతులు అంబలి తాగుతున్నారు. గంగయ్యకు చల్ది అన్నం, వూరగాయ జ్ఞాపకమొచ్చింది. అంతే, అతని కళ్ళు చీకట్లు కమ్మేయి. వూరూ, పొలాలు, కళ్ళం ఏదీ కనబడడంలేదు. "అమ్మో" అని కేక వేశాడు.

కిందనున్న రాయిమీద మోసింది గంగయ్య తల. అతని మొహం అతిప్రశాంతంగా వుంది. చేతిలో బాడిత ను పట్టు విడవలేదు. గంగయ్య మరణించేడు. కాని గంగయ్య విశ్వకర్మ. విశ్వకర్మకు చావేమిటి?